# 82. అల్ ఇన్‌ఫితార్ (బ్రద్దలు కావడం) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 19 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ముఖ్యంగా మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, తీర్పుదినం, శిక్షాబహుమానాల గురించి బోధించింది. తీర్పుదినాన చోటుచేసుకునే తీవ్రమైన రోదసీ (అంతరిక్షంలోని) మార్పులను గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. ఆ రోజున సమాధులు తెరువ బడతాయి. ఆకాశం బద్దలవుతుంది. నక్షత్రాలు చెల్లాచెదరవుతాయి. ప్రతి ఒక్కరికి తాను చేసిన మంచి లేదా చెడుల గురించి తెలిసి వస్తుంది. ఆ రోజు వేరుపరిచే రోజు. ఆరోజు మంచిపనులు చేసిన వారు ఆనందాన్ని అనుభవిస్తారు. మరణించిన తర్వాత మళ్ళీ లేపబడతామన్న వాస్తవాన్ని తిరస్కరించిన సత్యతిరస్కారులు అగ్నికి గురవుతారు.

## 82. అల్ ఇన్‌ఫితార్ సూరా

## سُورَةُ الانفطار

అవతరణ :మక్కా ఆయతులు : 19

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

1 ఆకాశం చీలిపోయినప్పుడు,[1]

إِذَا السَّمَاءُ انفَطَرَتْ ①

2 నక్షత్రాలు రాలి (పడి) పోయినప్పుడు,

وَإِذَا الْكَوَاكِبُ انتَثَرَتْ ②

3 సముద్రాలు ఉప్పొంగినప్పుడు,[2]

وَإِذَا الْبِحَارُ فُجِّرَتْ ③

4 సమాధులు పెళ్ళగించబడినప్పుడు,[3]

وَإِذَا الْقُبُورُ بُعْثِرَتْ ④

5 (అప్పుడు) ప్రతి ఒక్కనికీ తాను ముందుకు పంపుకున్నదీ, వెనుక వదలి పెట్టినదీ (అంతా) తెలిసివస్తుంది.[4]

عَلِمَتْ نَفْسٌ مَّا قَدَّمَتْ وَأَخَّرَتْ ⑤

6 ఓ మానవుడా! ఉదాత్తుడైన నీ ప్రభువు పట్ల ఏ విషయం నిన్ను మోసంలో పడ వేసింది?[5]

يَا أَيُّهَا الْإِنسَانُ مَا غَرَّكَ بِرَبِّكَ الْكَرِيمِ ⑥

1. అంటే – దైవాజ్ఞతో, దైవభీతితో ఆకాశం బ్రద్దలైపోతుంది. అప్పుడు దైవదూతలు క్రిందికి దిగివస్తారు.

2 అప్పుడు సముద్రాలన్నీ కలిసిపోతాయి. అప్పుడు అల్లాహ్ పంపే పశ్చిమ గాలివల్ల సముద్రంలో అగ్ని ప్రజ్వరిల్లుతుంది. ఉవ్వెత్తున మంటలు లేస్తాయి.

3. అంటే – మృతులు సమాధుల నుంచి బ్రతికి బయటికి వచ్చినప్పుడు... ఆ సమయంలో గోరీలలోని మట్టి పెళ్లగించబడుతుంది. లేదా సమాధులన్నీ అతలాకుతలం అవుతాయి.

4. అంటే – ఈ పరిణామాలన్నీ పొడసూపినప్పుడు మనిషికి తాను చేసినదంతా తెలిసి పోతుంది. తన మంచిపనులు – చెడుపనులన్నీ అతని ముందుకు వచ్చేస్తాయి. **"వెనుక వదలిపెట్టినది"** అంటే తన నడవడిక ద్వారా తన మరణానంతరం ప్రపంచంపై పడిన ప్రభావం అన్నమాట! అది మంచిదీ కావచ్చు. చెడ్డదీ కావచ్చు. ఒకవేళ అది మంచిదై ఉండి, భావితరాల వారు దాన్ని ఆదర్శంగా తీసుకుని ఆచరిస్తే ఆ పుణ్యం ఎడతెగకుండా అతనికి చేరుతూ ఉంటుంది. ఒకవేళ అతను వదలిపెట్టి పోయినది చెడ్డదై ఉండి, జనులు దాన్ని అవలంబిస్తే ఆ పాపం కూడా అతనికి ఎడతెగకుండా చేరుతూ ఉంటుంది.

5. నువ్వెందుకు ఆ కృపాకరుణ్ణి ధిక్కరిస్తున్నావు? అసలు ఏ విషయం నిన్ను ఆయన

**7** (యదార్థానికి) ఆయనే నిన్ను పుట్టించాడు,[6] నిన్ను చక్కగా తీర్చిదిద్దాడు,[7] ఆపైన నిన్ను తగు రీతిలో పొందికగా మలిచాడు.[8]

الَّذِیْ خَلَقَكَ فَسَوّٰىكَ فَعَدَلَكَ ۙ۝۷

**8** తాను కోరిన ఆకారంలో నిన్ను కూర్చాడు.[9]

فِیْۤ اَیِّ صُوْرَةٍ مَّا شَآءَ رَكَّبَكَ ۝۸

**9** ఎన్నటికీ కాదు, మీరైతే శిక్షా బహుమానాల దినాన్ని ధిక్కరిస్తున్నారు.[10]

كَلَّا بَلْ تُكَذِّبُوْنَ بِالدِّیْنِ ۙ۝۹

---

గురించి ఏమార్చింది? చూడబోతే నీకు ఉనికిని ప్రసాదించి, నీకు తెలివితేటలను ఇచ్చి, మంచి మార్గాన్ని చూపే ఏర్పాటుచేసి, నీకు మహోపకారం చేసినవాడు ఆయనే కదా!

6. మరి నిన్ను పుట్టించింది కూడా దేంతో? అత్యంత అల్పమైన రేతస్సుతో! అంతకు ముందు నీకంటూ ఒక ఉనికి ఉండేదే కాదు.

7. నిన్ను ఒక సంపూర్ణ మనిషిగా – నఖశిఖ పర్యంతం – తీర్చిదిద్దాడు. నీకు కనే, వినే, గ్రహించే శక్తులను ప్రసాదించాడు.

8. తగు రీతిలో మలచటమంటే అర్థం – శరీరావయవాల నిష్పత్తిలో ఎలాంటి లోపం లేకుండా చేశాడు. కళ్లుండవలసిన చోట కళ్లను, కాళ్లుండవలసిన చోట కాళ్ళను ఉంచాడు. రెండు చేతులను, రెండు చెవులను, రెండు పెదవులను, ముక్కును, నాలుకను సమపాళ్ళలో రూపొందించాడు. ఆలోచించే, అర్థం చేసుకునే మనోమస్తిష్కాలను వొసగాడు. వీటన్నింటినీ అనుగ్రహించి, సభ్య సమాజంలో నిన్ను ఎంతో అందమైన జీవిగా నిలబెట్టాడు. నీ ఆకృతి గురించి చెబుతూ, "మేము మానవుణ్ణి అత్యుత్తమమైన ఆకృతిలో సృజించాము" అని అన్నాడు. (సూరెతీన్)

9. దీనికి ఒక అర్థం ఇది: దేవుడు గర్భస్థ శిశువుకు తాను కోరిన వారి పోలికల్ని–అంటే తల్లి పోలికల్నిగానీ, తండ్రిపోలికల్నిగానీ, మేనమామ పోలికల్నిగానీ ప్రసాదిస్తాడు. మరొక అర్థం ప్రకారం, దేవుడు తాను కోరిన ఆకారం ఇవ్వగలడు. ఆయన గనక తలచుకుంటే భయంకరమైన జంతువు ఆకారంలో కూడా పుట్టించగలడు. కాని ఆయన పరమదాత, ఉదాత్తుడు అయినందువల్ల సాధారణంగా అలా చేయడు. మనిషిని ఆయన మంచి ఆకృతిలోనే పుట్టిస్తాడు.

10. ఓ అవిశ్వాసులారా! తీర్పుదినంపై మీకు నమ్మకం లేకపోవటం మూలంగానే అసలు మీరు దేవుడు చేసిన గొప్ప మేళ్లను మరచిపోతున్నారు. పరలోకభీతి మీలో పాదుకోనంతవరకూ మీ ఆలోచనలు వక్రంగానే ఉంటాయి.

**10** నిశ్చయంగా మీపైన పర్యవేక్షకులు నియమితులై ఉన్నారు.

وَإِنَّ عَلَيْكُمْ لَحَافِظِينَ ۝١٠

**11** (వారు మీ కర్మలను నమోదు చేసే) గౌరవనీయులైన లేఖకులు.

كِرَامًا كَاتِبِينَ ۝١١

**12** మీరు చేసేదంతా వారికి తెలుసు సుమా![11]

يَعْلَمُونَ مَا تَفْعَلُونَ ۝١٢

**13** నిశ్చయంగా పుణ్యాత్ములు (స్వర్గ) సుఖాలలో ఉంటారు.

إِنَّ الْأَبْرَارَ لَفِي نَعِيمٍ ۝١٣

**14** మరి నిశ్చయంగా పాపాత్ములు నరకాగ్నిలో ఉంటారు.[12]

وَإِنَّ الْفُجَّارَ لَفِي جَحِيمٍ ۝١٤

**15** ప్రతిఫల దినాన వారు అందులోకి ప్రవేశిస్తారు.[13]

يَصْلَوْنَهَا يَوْمَ الدِّينِ ۝١٥

11. తీర్పుదినాన్ని మీరు త్రోసిపుచ్చినంత మాత్రాన అది మీనుండి తొలగిపోతుందని అనుకోకండి. మీకు ఇష్టమున్నా, లేకున్నా మీరు క్షణం క్షణం దానివైపుకు తీసుకుపో బడుతున్నారు. మరోవైపు మీ కర్మలు గ్రంథస్థం అవుతున్నాయి. దైవదూతలు మీపై కావలివాళ్లుగా నియమితులై ఉన్నారు. మీ నోట వెలువడే ఒక్కో మాటా, మీ చేత జరిగే ఒక్కో చేష్టా రికార్డు అవుతోంది. కాబట్టి మీరు ఒక మాటను పలికేముందు అది సరైనదో కాదో ఆలోచించుకోండి. ఒక పనిని చేసే ముందు అది మంచిపనో చెడ్డపనో తేల్చుకోండి – "ఇద్దరు లేఖకులు అతనికి కుడిప్రక్కన, ఎడమప్రక్కన కూర్చొని ప్రతి విషయాన్నీ నమోదు చేస్తున్నారు. అతని నోటినుండి వెడలే ప్రతి మాటనూ వ్రాయటానికి అనుక్షణం ఒక పరిశీలకుడు సిద్ధంగా ఉంటాడు." (ఖాఫ్ – 17, 18). ఒక దైవదూత మంచిపనులను రికార్డు చేస్తే, మరొక దూత చెడుపనులను నమోదు చేస్తాడన్నమాట! ఈ డ్యూటీని రాత్రిపూట ఇద్దరు దూతలు, పగటిపూట ఇద్దరు దూతలు నిర్వహిస్తారని హదీసుల్లో వివరించబడింది.

12. మరోచోట చెప్పబడినట్లు; "ఒక వర్గంవారు స్వర్గానికి పోతే, మరో వర్గం వారు నరకానికి పోతారు" (షూరా – 7).

13. వారు ఏ శిక్షా బహుమానాల దినాన్ని ధిక్కరించేవారో సరిగ్గా ఆ దినానే తమ దుష్కర్మ లకు ప్రతిగా నరకానికి ఆహుతి అవుతారు.

**16** వారు దాన్నుండి ఎన్నటికీ అదృశ్యం కాలేరు.[14]

وَمَا هُمْ عَنْهَا بِغَآئِبِيْنَ ﴿١٦﴾

**17** ఆ ప్రతిఫల దినం ఎటువంటిదో నీకేం తెలుసు?

وَمَآ اَدْرٰىكَ مَا يَوْمُ الدِّيْنِ ﴿١٧﴾

**18** మరి ఆ ప్రతిఫల దినం ఎటువంటిదో (దాని గురించి) నీకేం తెలుసు?[15]

ثُمَّ مَآ اَدْرٰىكَ مَا يَوْمُ الدِّيْنِ ﴿١٨﴾

**19** ఆ రోజు ఏ జీవీ మరో జీవి కోసం ఏమీ చెయ్యజాలదు. ఆ రోజు సమస్త వ్యవహారాలు (అధికారాలన్నీ) అల్లాహ్ వద్దనే ఉంటాయి.[16]

يَوْمَ لَا تَمْلِكُ نَفْسٌ لِّنَفْسٍ شَيْـًٔا ۖ وَالْاَمْرُ يَوْمَئِذٍ لِّلّٰهِ ﴿١٩﴾

14. అంటే – వారు దాన్నుండి బయటపడటంగానీ, వేరుకావటంగానీ జరగదు. కలకాలం అందులోనే పడి ఉంటారు.

15. ఆ దినానికి గల ప్రాముఖ్యాన్ని, దాని ఔన్నత్యాన్ని, ఆగ్రహస్థితిని స్పష్టం చేయడానికి ఇక్కడ మళ్లీ మళ్లీ ప్రశ్నించటం జరిగింది.

16. దేవుడు మనిషిని పరీక్షించే నిమిత్తం ఈ ప్రాపంచిక జీవితంలో – తాత్కాలికంగా – మనిషికి కొన్ని అధికారాలను దత్తం చేశాడు. కాని ప్రళయదినాన మనిషికి ఏ నిర్ణయాధికారమూ ఉండదు. సర్వాధికారాలు అల్లాహ్ అధీనమై ఉంటాయి. దివ్య ఖుర్‌ఆన్‌లో సెలవీయబడినట్లు–"ఈ రోజు విశ్వసార్వభౌమాధికారం ఎవరిది? అది ఒకే దేవుడు, సర్వాధికారం గల అల్లాహ్‌దే కదా!" అని అనబడుతుంది (మోమిన్ – 16). అందుకే అంతిమ దైవప్రవక్త (స) తన ముద్దుల కూతురు (ఫాతిమా)ను, తన మేనత్త సఫియా (ర.అన్హా)ను ఉద్దేశించి ఇలా అన్నారు : "నేను మీకోసం దైవసన్నిధిలో ఏ అధికారమూ కలిగి ఉండను సుమా!" (సహీహ్ ముస్లిం–కితాబుల్ ఈమాన్). బనీ హాషిమ్, బనీ అబ్దుల్ ముత్తలిబ్ వారిని ఉద్దేశించి, "మిమ్మల్ని మీరు అగ్ని నుండి కాపాడుకోండి. దైవసాక్షి! దైవ సన్నిధిలో నేను మీకు ఏ విధంగానూ తోడ్పడలేను" అని చెప్పారు. (ముస్లిం : కితాబుల్ ఈమాన్).